# ఏంటీ-సెంటిమెంట్

ఏర్‌కండీషన్డ్ గది.

ఆ గదిలోని వాతావరణంకన్నా యింకా చల్లగా వున్న బీరు తాగుతున్నాడు సినిమా రచయిత. ఆయనొక్కడేకాదు. ఆయనతోపాటు మరో ముగ్గురుకూడా.

నిర్మాత, దర్శకుడు, సహకార దర్శకుడు ఆ ముగ్గురు.

"హీరోయిన్‌కి నెల తప్పింది. రైటే పెళ్ళికాకుండా అలా జరిగినా ప్రేక్షకులు వప్పుకుంటారు కొడుకుపుట్టినా వప్పుకుంటారు కాని హీరోయిన్ తండ్రి ఆమెకి అబార్షన్ చేయించి యింకొకడికిచ్చి పెళ్ళి చేయడమేమిటండి? ఇది పూర్తిగా యాంటీసెంట్‌మెంట్ పనికిరాదు" చెప్పాడు సినిమా రచయిత.

"నవలలో అలాగే వుంది" చెప్పాడు సహకార దర్శకుడు.

"నవల వేరు! సినిమా వేరు నవలల్లో ఏం రాసినా చెల్లుతుంది సినిమా జీవితంలాంటిది జీవితంలో ఏ అపస్మృతులు మనుషులకి నచ్చవో అవి తెరమీద భరించలేరు. అవన్నీ ఏంటీసెంటిమెట్లు?"

కాని ఆ నవలలో...."

"నోనో! నేను అంగీకరించను ఓల్డ్ థింకింగ్ హీరోయిన్ కొడుకుని పెంచి పెద్దవాడ్నిచేస్తుంది. కొడుకు నేవీలో చేరతాడు. ఓరోజు తన ఆఫీసర్‌ని ఇంటికి ఆహ్వానిస్తాడు. ఆ ఆఫీసరే అతని తండ్రి హీరో, హీరోయిన్ ఒకర్నొకరు గుర్తుపడతారు. వాళ్ళ మెంటల్ కాన్‌ఫ్లిక్టు ఇమోషనల్ ప్లే సాంగు– ఆ ట్రెండ్‌లో ఆలోచించాలి...."

అరగంట చర్చ జరిగాక ఆ నవల సినిమాకి పనికిరాదని తేల్చేశారు ఆ పాప్యులర్ నవలమీద జరిగిన చర్చవల్ల మరో కొత్త కథ తయారైంది ఆ కథకి ఓ రూపం ఇచ్చే ప్రయత్నం చేయసాగారు నలుగురూ.

పాప్యులర్ అయిన నవలల్లోని కథలని గుర్తుతెచ్చేలా వుండే అనేక తెలుగు సినిమాలెన్నో వచ్చాయి మరి!

ఓ ఐదు నెలలు వెనక్కి వెళితే ఆరోజు....

* * * *

సినిమా రచయిత కోపంతో తన కూతురు జుట్టుపట్టుకుని కసితీరా కొట్టాడు.

"సిగ్గులేదు పెళ్ళికాకుండానే...." రొప్పుతూ అగాడు.

వారంతర్వాత సూళ్ళూరుపేటలోని నర్సింగ్ హోమ్‌లో తన కూతురికి చడీ చప్పుడు కాకుండా అబార్షన్ చేయించాడు కాలేజీ మాన్పించాడు.

ఆ అమ్మాయికి మంచి సంబంధాలు చూస్తున్నారు.

ఇవాళో రేపో పెళ్ళయిపోతుందా అమ్మాయికి, పెళ్ళికాకుండా కొడుకుని కని, ఆ బాబుని పెంచటం జీవితంలో ఏంటీ సెంటిమెంట్ మరి!